సాక్షి ప్రకాశం

శనివారం : 20 : సెప్టెంబర్ : 2025



శ్మశానానికి స్థలం చూపాలని నిరసన

తమ గ్రామానికి శ్మశాన స్థలం చూపించాలంటూ మృతదేహంతో నిరసన తెలిపిన ఘటన పొన్నలూరు మండలం మాలపాడు పంచాయతీ చెంచుపాలెంలో జరిగింది. - IIలో..



వైద్య విద్యపై కూటమి దుష్ట పన్నాగం

వైద్య విద్యపై కూటమి ప్రభుత్వం దుష్ట పన్నాగం పన్నుతోందని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. పీపీపీ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. - IIలో..

గరిష్టం/కనిష్టం

34 /25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు

న్యూస్‌రీల్

వచ్చే ఆగస్టు నాటికి వెలుగొండ పూర్తి

- కలెక్టర్ రాజాబాబు
- అధికారులతో కలిసి వెలుగొండ ప్రాజెక్టు సొరంగ నిర్మాణాల పరిశీలన



వెలుగొండ ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు

పెద్దదోర్నాల: జిల్లా జీవనాడి అయిన పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును వచ్చే ఏడాది ఆగస్టు నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ రాజాబాబు తెలిపారు. మండల పరిధిలోని కొత్తూరు వద్ద జరుగుతున్న సొరంగ నిర్మాణ పనులను శుక్రవారం అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. గంటవానిపల్లె చెరువు వద్ద కాలువ పనులను, తీగలేరు వాగును పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెలిగొండ ప్రాజెక్టు అతిథి గృహంలో ప్రాజెక్టు ఇంజినీరింగ్, భూసేకరణ అధికారులు, ప్రాజెక్టు నిర్మాణ ప్రతినిధులతో సమావేశమై ప్రాజెక్టు పురోగతి, పునరావాస కార్యక్రమాల అమలు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే మొదటి సొరంగం పనులు పూర్తయ్యాయని ఇంజినీరింగ్ అధికారులు ఆయనకు వివరించారు. ప్రాజెక్టు నిర్మాణం వలన తాగు, సాగు నీటి ప్రయోజనాలు ఇతర వివరాలను ప్రాజెక్టు ఎస్ఈ అబూతాలింను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం రెండో సొరంగం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయన్నారు. పనులు త్వరగా పూర్తయ్యేలా మరింత దృష్టి సారించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ముంపు గ్రామాల ప్రజలకు పునరావాస కాలనీల కోసం అవసరమైన ల్యాండ్ డెవలప్‌మెంట్ పనులు పూర్తయ్యాయన్నారు. ప్రాజెక్టు నిర్మాణ పనులు, ముంపు గ్రామాల ప్రజల తరలింపును వచ్చే ఆగస్టు నాటికి పూర్తయ్యేలా చూస్తున్నామన్నారు. కలెక్టర్ వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట సహదిత్ త్రివినాథ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్ రెడ్డి, సత్యనారాయణ, సీతారామిరెడ్డి, ఉన్నారు.

గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి

- జేసీ గోపాలకృష్ణ



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు వన్‌టౌన్: జిల్లా గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జేసీ గోపాల కృష్ణ రోణంకి అన్నారు. జేసీ చాంబర్‌లో గ్రంథాలయ సంస్థ అభివృద్ధి సమావేశాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ సెస్ బకాయిలను సంస్థకు చెల్లించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా ఆడిట్ అధికారి, ఒంగోలు మున్సిపల్ కమిషనర్, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్‌లు, ఏపీఐఐసీ కమిషనర్, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యేలు బూచేపల్లి, తాటిపర్తి, నియోజకవర్గ ఇన్‌చార్జులు కేపీ, దద్దాల, చుండూరి తదితరులు

బాబు పీపీపీ.. వైద్యం అందని ద్రాక్ష

- మార్కాపురం మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్మించాలి
- లేకపోతే ఆమరణ దీక్ష చేస్తా
- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు
- పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యేలు బూచేపల్లి, తాటిపర్తి, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు
- జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు



మెడికల్ కాలేజీ భవనాలను చూపుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



మెడికల్ కాలేజీ భవనాల వద్ద సెల్ఫీ తీసుకుంటున్న తాటిపర్తి, బూచేపల్లి, వెంకాయమ్మ, అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, చుండూరి రవిబాబు తదితరులు

మార్కాపురం/మార్కాపురం టౌన్: మెడికల్ కాలేజీని ప్రైవేటు పబ్లిక్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో నిర్మించడం వలన పేద ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతుందని, వైద్యం అందని ద్రాక్షలా మారుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు, వైఎస్సార్ సీపీ మార్కాపురం, గిద్దలూరు ఇన్‌చార్జ్‌లు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కాపురం మండలం రాయవరం వద్ద చేపట్టిన మెడికల్ కళాశాలను కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో నిర్మిస్తున్నందుకు నిరసనగా శుక్రవారం వైఎస్సార్ సీపీ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. పశ్చిమ ప్రజల ఆశాదీపంగా ఉన్న మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేయడం తగదని వారు నినదించారు. ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు నాణ్యమైన వైద్యం, వైద్యవిద్య ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో మెడికల్ కళాశాలలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారని, వీటిలో అనేక మెడికల్ కళాశాలలు దాదాపు పూర్తయ్యే దశలో ఉండగా కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో నిర్మించాలనుకోవడం దుర్మార్గపు చర్య అన్నారు. పశ్చిమ ప్రకాశానికి మార్కాపురం మెడికల్ కాలేజీ వరమని అన్నారు. ఇలాంటి మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయాలనే ఆలోచన కూటమి ప్రభుత్వం చేయడం తగదన్నారు. చంద్రబాబు నాయుడు 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ఒక్క మెడికల్ కాలేజీ కూడా తీసుకురాలేదని విమర్శించారు. ఒకేసారి 17 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి మంచిపేరు వస్తుందనే అక్కసుతో చంద్రబాబు నాయుడు మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తున్నారని ఆరోపించారు. సీట్లను అమ్ముకోవాలనే ఉద్దేశంతోనే ప్రైవేటుపరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మెడికల్ కళాశాలలను నిర్మించాలని బూచేపల్లి డిమాండ్ చేశారు. పేద ప్రజల ఆరోగ్యం కోసం ఉద్యమం చేపడతామని అన్నారు.

రూ.కోట్ల విలువైన ఆస్తులు ప్రైవేటుపరం:

యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రాణదాత వైఎస్ జగన్ అన్నారు. 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటువారికి ధారాదత్తం చేసేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వైఎస్సార్ సీపీ వ్యతిరేకిస్తోందన్నారు. ఒక్కొక్క మెడికల్ కళాశాల భూమి విలువ దాదాపు రూ.300 కోట్లు ఉంటుందని, ప్రభుత్వ ఆస్తిని ఎలా ప్రైవేటీకరణ చేస్తారని ప్రశ్నించారు. ఇంత వరకూ వెలుగొండను పూర్తిచేయలేదని ఆయన విమర్శించారు.

ప్రభుత్వ వైఖరి మారకుంటే ఆమరణ దీక్ష

మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు మాట్లాడుతూ నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పరంగా మెడికల్ కళాశాలను కడితే వాటిని పూర్తిచేసేందుకు ప్రైవేటు పరం చేయడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇదే ధోరణితో ముందుకెళితే తాను ఆమరణ దీక్షకు కూర్చుంటానని హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ దాదాపు పూర్తి కావచ్చిన మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో కట్టాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ఈ విధానం వలన వైద్య విద్య పేద ప్రజలకు అందదని, ఉచిత వైద్యం కూడా అందదన్నారు. మళ్లీ ఉచిత వైద్యం కోసం ఒంగోలు, గుంటూరు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటుచేస్తే 150 సీట్లు అర్హులైన విద్యార్థులందరికీ ఉచితంగా దక్కుతాయని, పేదలు ఓపీ ఫీజు చెల్లించకుండానే ఉచిత వైద్యం పొందవచ్చని చెప్పారు. తక్షణమే పీపీపీ విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వమే మెడికల్ కాలేజీని కట్టాలని డిమాండ్ చేశారు. తాను 2019లో వైఎస్ జగన్ వద్దకు వెళ్లి మెడికల్ కళాశాల ప్రాధాన్యతను వివరించగానే మంజూరు చేశారని, ఈ ప్రాంత ప్రజలకు ఇదొక వరం లాంటిదన్నారు.

కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యేలు జంకె వెంకటరెడ్డి, కసుకుర్తి ఆదెన్న, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కేవీ రమణారెడ్డి, వైవీరావు, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ షంషేర్ అలీబేగ్, పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మార్కాపురం పట్టణ, మండల, తర్లుపాడు, పొదిలి, కొనకనమిట్ల అధ్యక్షులు సలీమ్, చెంచిరెడ్డి, మురారి వెంకటేశ్వర్లు, గుజ్జుల సంజీవరెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, ఎంపీపీలు లక్ష్మీదేవీ కృష్ణారెడ్డి, భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీలు నారు బాపన్‌రెడ్డి, అక్కిదాసరి ఏడుకొండలు పాల్గొన్నారు. వీరితోపాటు అంగన్‌వాడీ మహిళా కార్యదర్శి ఉడుముల వరలక్ష్మమ్మ, గుజ్జుల రమణారెడ్డి, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జీ శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి విభాగం కన్వీనరు ఏలూరి సంజీవరెడ్డి, గాయం శ్రీనివాసరెడ్డి, బీ బాలకృష్ణారెడ్డి, ఉడుముల కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల పార్టీ కన్వీనర్లు డీ వెంకటేశ్వర్లు, ఎస్ పోలిరెడ్డి, కృష్ణారెడ్డి, జీవీ రమణారెడ్డి, ముసలారెడ్డి, ఎంపీపీలు కిరణ్‌గౌడ్, ఆళ్ల ఆంజనేయరెడ్డి, బెజవాడ చిన్న గురవయ్య, జెడ్పీటీసీ చలమారెడ్డి, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఉడుముల అరుణ, వై వెంకటేశ్వరరెడ్డి, అరుణాబాయి, జానకిరఘు, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మాజీద్, రాములు పాల్గొనగా గిద్దలూరు నియోజకవర్గం నుంచి కొమరోలు జెడ్పీటీసీ వెంకట నాయుడు, మండల కన్వీనర్ రవికుమార్, గిద్దలూరు మాజీ ఎంపీపీ వంశీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఓబులరావు, బేస్తవారిపేట ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, రాజయ్య, మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, వెన్న భాస్కర్‌రెడ్డి, స్టేట్ మైనార్టీ సెక్రటరీ గఫార్‌అలీఖాన్, అర్థవీడు ఎంపీపీ వెంకటరావు, మండల కన్వీనరు రంగారెడ్డి, రవికుమార్ యాదవ్, కనిగిరి నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు మడతల కస్తూరిరెడ్డి, తిరుపతిరెడ్డి, గంగసాని లక్ష్మీరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తమ్మినేని సుజాతరెడ్డి, హుస్సేన్ రెడ్డి, వై శ్రీకాంత్‌రెడ్డి, పులి రమేష్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజలు పాల్గొన్నారు.



ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



మెడికల్ కాలేజీ భవనాల వద్ద పార్టీ నాయకులు



మెడికల్ కాలేజీ భవనాల వద్దకు భారీగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



ఎమ్మెల్యే బూచేపల్లికి నోటీసులు ఇస్తున్న పోలీసులు

ఖద్దరు ఆడిస్తూ.. ఖాకీ చెలరేగుతూ!

ప్రభుత్వ వైఫల్యాలను, అసమర్థతను, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే గొంతులను నొక్కేందుకు చేయని కుతంత్రాలు లేవు. ప్రజల పక్షాన నిలబడి వైఎస్సార్ సీపీ చేపట్టే కార్యక్రమాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పుతోంది. పాలకుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారిన ఖాకీలు రకరకాల ఆంక్షలు విధిస్తూ నోటీసులు ఇస్తున్నారు. అర్ధరాత్రి, అపరాత్రి తేడా లేకుండా ఇంటి తలుపు తట్టి నోటీసులు ఇస్తూ అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. ప్రజాందోళన కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. పాలకులు అమలు చేస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని, ఆంక్షలను దాటి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల పక్షాన నిలుస్తూ ఆందోళనలు చేస్తున్నారు.

- ప్రజా సమస్యలు ప్రస్తావించకుండా అడుగడుగునా ఆంక్షలు
- పోలీసు యాక్ట్ 30 పేరుతో వైఎస్సార్ సీపీ నేతలకు నోటీసులు
- ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రజలకు కనిపించకుండా ఆపసోపాలు
- వెన్నుపోటు దినం, ఫీజు రీయింబర్స్‌మెంట్, అన్నదాతకు అండగా ర్యాలీలు చేయకుండా ఆటంకాలు
- తాజాగా మెడికల్ కాలేజీల వద్దకు వెళ్లకుండా అర్ధరాత్రి నోటీసులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతిపక్ష పార్టీల నేతలపై పోలీసుల ఆంక్షలు ఎక్కువయ్యాయి. జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడకుండా ప్రతిపక్షం గొంతు నొక్కేందుకు చంద్రబాబు ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోంది. స్వామి భక్తిని నిరూపించుకునేందుకు పోలీసులు అత్యుత్సాహాన్ని చూపిస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే చాలు లాఠీలు ఝుళిపిస్తున్నారు. ప్రజలకు అండగా నిలిచిన ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా సంఘాల నాయకుల మీద కేసులు బనాయిస్తున్నారు. నోటీసులు ఇస్తూ ప్రజాందోళన కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. డ్రోన్ కెమెరాలను ఎగరేసి పార్టీ నాయకులను బెదిరించేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. చివరికి ప్రజాస్వామ్యయుతంగా ర్యాలీలు చేసేందుకు కూడా సవాలక్ష ఆంక్షలు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారు. రైతు సమస్యలపై ఆర్డీఓకు వినతి పత్రం ఇవ్వడం కూడా నేరమైపోతోంది. వినాయక చవితి పండుగను కూడా రాజకీయం చేయడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించే పండుగలపై ఆంక్షలు విధించడమే కాకుండా కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారు. దీనిపై అన్ని వర్గాల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ప్రతిపక్షంపై పోలీసు కన్ను...

ఏడాదిన్నర క్రితం చంద్రబాబు ప్రభుత్వం గద్దెనెక్కిందే తడవుగా ప్రజా వ్యతిరేక విధానలకు తెరదీసింది. ప్రజల పక్షం నిలబడి పోరాటాలు చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పిలుపునిచ్చింది. ఏడాది కాలంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో వైఎస్సార్ సీపీ యువత పోరుకు పిలుపునిచ్చింది. అప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందనుకుంటే అందుకు బదులుగా పోరాటాన్ని అణిచివేసేందుకు పోలీసులను రంగంలోకి దించింది. అంతేకాకుండా పెరిగిన కరెంటు చార్జీలకు వ్యతిరేకంగా రైతు పోరు నిర్వహించింది. ఇమాంలు, మౌజన్లకు గౌరవ వేతనం చెల్లించాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై వెన్నుపోటు దినం పేరుతో నిరసనలు చేపట్టారు. యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ అన్నదాత పోరు పేరుతో జిల్లాలోని ఆర్డీఓలకు వినతి పత్రం అందజేశారు. తాజాగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్మించిన మెడికల్ కళాశాలలను పీపీపీ ముసుగులో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడాన్ని నిరసిస్తూ చలో మెడికల్ కాలేజీలకు వైఎస్సార్ సీపీ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో పాల్గొనకుండా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నాగార్జున రెడ్డిలకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. వైఎస్సార్ సీపీ ఏ ఉద్యమం చేపట్టినా కూటమి ప్రభుత్వం అడ్డుకునేందుకు పోలీసులను రంగంలోకి దించడం ఆనవాయితీగా మారిపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పోలీసు యాక్ట్ పేరుతో నోటీసులు...

ప్రజా సమస్యలపై వైఎస్సార్ సీపీ చేస్తున్న పోరాటాలను అడ్డుకునేందుకు పోలీసు యాక్ట్ 30ను ప్రయోగిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించడానికి లేదని చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీ చేపట్టే పోరాటాలకు అనుమతులు ఇవ్వకుండా తిప్పుకుంటున్నారు. తీరా అనుమతులు ఇచ్చిన తరువాత కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. పొగాకు సమస్యపై జిల్లాకు చెందిన రైతులతో మాట్లాడేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పొదిలి పర్యటనకు వచ్చినప్పుడు కూడా పోలీసులు ఇదే తీరులో వ్యవహరించారు. పోలీసుల అనుమతి తీసుకొని పర్యటనకు వచ్చినప్పటికీ ర్యాలీలో పాల్గొన్న రైతులు, పార్టీ కార్యకర్తల మీద కేసులు పెట్టి అర్ధరాత్రి అరెస్టు చేసి వేధింపులకు పాల్పడ్డారు. తాజాగా చలో మెడికల్ కాలేజీ కార్యక్రమానికి నాయకులు వెళ్లకుండా నోటీసులు ఇచ్చారు. అర్ధరాత్రి నాయకుల ఇంటికి వెళ్లి నోటీసులు ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. శాంతియుతంగా నిర్వహించే కార్యక్రమాలకు కూడా నోటీసులు ఇవ్వడంపై ప్రజా సంఘాల నాయకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

వినాయక చవితి పండుగపై ఆంక్షలు...

వినాయక చవితి పండుగ వచ్చిందంటే చాలు ప్రతి ఊరిలో, పట్టణాల్లోని ప్రధాన వీధుల్లో మండపాలు ఏర్పాటు చేసి వినాయకుడి పూజలు నిర్వహిస్తుంటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వినాయక చవితి పండగను కూడా రాజకీయం చేసేసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకుల నేతృత్వంలో ఏర్పాటు చేసిన మండపాలకు ఒక రూలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన భక్తులు ఏర్పాటు చేసుకున్న మండపాలకు మరొక రూలు విధించి ఇబ్బందులకు గురిచేయడం ఆనవాయితీగా వస్తోంది. చివరికి నిమజ్జనం ఊరేగింపులు కూడా తొలుత టీడీపీ నాయకులు చేసుకోవాలని, తరువాతే వైఎస్సార్ సీపీ నాయకులు చేయాలని షరతులు విధిస్తున్నారు. దీంతో గ్రామాల్లో గొడవలు జరుగుతున్నాయి. ఒంగోలు నగరంలోని 45వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జనం ఊరేగింపును అడుగడుగునా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటను సాకుగా చూపి వైఎస్సార్ సీపీ కార్యకర్తల మీద కేసులు బనాయించి రిమాండ్‌కు పంపించడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇందులో ఒక మైనర్‌పై కూడా కేసు నమోదు చేయడమే కాకుండా రిమాండ్‌కు పంపించారు.



ఎమ్మెల్యే తాటిపర్తికి నోటీసు అందచేస్తున్న ఎస్సై

బూచేపల్లి, తాటిపర్తికి పోలీసుల నోటీసులు

చీమకుర్తి/యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. మెడికల్ కాలేజీల వద్ద నిరసన కార్యక్రమంలో పాల్గొనకుండా ఉండేందుకు శుక్రవారం చీమకుర్తిలోని బూచేపల్లి నివాసంలో కలిసి నోటీసులు ఇచ్చారు. పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉన్నందున ఎలాంటి ర్యాలీలు, ఇతర నిరసనల కార్యక్రమాల్లో పాల్గొనకూడదని పోలీసులు ఇచ్చిన నోటీసులో పేర్కొన్నారు.

మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, డివిజన్ పరిధిలో ర్యాలీలు, సభలు నిర్వహించకూడదని, యాక్ట్ ఉల్లఘించిన వారిపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తూ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్‌కు వైపాలెం ఎస్సై పి.చౌడయ్య నోటీసు అందజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే ఛలో మెడికల్ కాలేజ్ కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధం అవుతున్న సమయంలో మార్కాపురం డీవైఎస్పీ నుంచి వచ్చిన నోటీసును ఎస్సై అందజేశారు. ఛలో మెడికల్ కాలేజ్ కార్యక్రమాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం పన్నిన కుట్రలో భాగంగా తనకు నోటీసు అందచేశారని, ఇటువంటి నోటీసులకు తాను, పార్టీ కార్యకర్తలు భయపడేదే లేదని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కూడా కూటమి ప్రభుత్వం కాలరాస్తోందని తాటిపర్తి మండిపడ్డారు.

క్లుప్తంగా

డెయిరీ భూముల పరిశీలన


డెయిరీ భూములను పరిశీలిస్తున్న రెవెన్యూ బృందం

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు మండలంలోని పాల కేంద్రం వద్ద వివాదాస్పద డెయిరీ భూములను శుక్రవారం సంతనూతలపాడు తహసీల్దార్ ఎస్.ఎల్.నారాయణరెడ్డి, మండల సర్వేయర్ ఎం.రాజేష్ తదితరులు పరిశీలించారు. 138/1బీలో ఎకరా భూమిని గతంలో ఐదుగురు వ్యక్తులు కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకున్నారు. అయితే అది డెయిరీ భూమి అంటూ డెయిరీ నిర్వాహకులు అడ్డుపడటంతో సదరు భూములు కొనుగోలు చేసిన వ్యక్తులు కోర్టును ఆశ్రయించారు. ఎల్‌జీ, ఓపీ కోర్టు కేసుల నిమిత్తం ఆ భూములను రెవెన్యూ బృందం పరిశీలించింది. కొంతకాలం నుంచి డెయిరీ భూములు కొనుగోలు చేసిన వారు–డెయిరీ నిర్వాహకుల మధ్య వివాదం కొనసాగుతోంది. రెవెన్యూ బృందంతో డెయిరీ సీఈవో రాజమౌళి, వీఆర్వో వెన్నెల, పిటీషనర్లు, లాయర్లు పాల్గొన్నారు.

తర్లుపాడు పోలీసులపై డీజీపీకి ఫిర్యాదు

తర్లుపాడు: తర్లుపాడు పోలీసుల పనితీరు, అవినీతి అక్రమాలపై రాష్ట్ర డీజీపీతోపాటు రేంజ్ డీఐజీ, ఎస్పీ, డీఎస్పీలకు ఫిర్యాదు చేసినట్లు ప్రజా సంకల్ప వేదిక అధ్యక్షుడు, న్యాయవాది మదిరె రంగసాయిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర గవర్నర్, హోం మంత్రి, పోలీసు కంప్లయింట్ అథారిటీకి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. శనివారం తర్లుపాడులో బాధితులను కలిసిన అనంతరం ప్రెస్‌మీట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అర్ధవీడు: విద్యుదాఘాతానికి గురై ఒకరు మృతి చెందిన సంఘటన అర్ధవీడు మండలంలోని అయ్యవారిపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై శివ నాంయారయ్య కథనం మేరకు వివరాలు.. చింతమెల్లెలపాడు ఎస్సీ కాలనీకి చెందిన యేసుపోగు చిన్నకాశయ్య(45) ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లిన పశువులను పక్కకు తోలే క్రమంలో విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైద్య విద్యపై కూటమి దుష్ట పన్నాగం

- జగనన్న ఒకేసారి 17 మెడికల్ కాలేజీలు తెచ్చారు
- చంద్రబాబు వాటిని తన అనుచరులకు కారుచౌకగా అమ్మేస్తున్నారు
- యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజం


వైపాలెం: ఛలో మెడికల్ కాలేజ్ బ్రోచర్లను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి


వైపాలెం: వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పదవీ కాలంలో పేద విద్యార్థులు, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేశారని, వాటిలో కొన్ని నిర్మాణం పూర్తయి వైద్య విద్యార్థుల అడ్మిషన్లు కూడా జరిగాయని, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేట్ పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు ముందుకు వేయడం దుర్మార్గమన్నారు. జగనన్న ఇచ్చిన పిలుపు మేరకు చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమంలో భాగంగా మార్కాపురంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల వద్దకు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయం వద్దకు చేరిన ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, అభిమానులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పొలిటికల్ ఇండస్ట్రీలో 40 ఏళ్ల అనుభవం ఉందని చెప్పుకుంటున్న కూటమి నాయకుడు, సీఎం నారా చంద్రబాబునాయుడు ఒక్క మెడికల్ కాలేజీని మంజూరు చేయించలేకపోయాడని, రాష్ట్రంలో ఉన్న మెడికల్ కళాశాలలను తానే ఏర్పాటు చేయించానని అబద్ధపు మాటలు చెబుతున్నాడని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం చేపట్టే ప్రతి కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తుండటంతో కూటమి ప్రభుత్వ నాయకులకు వణుకుపుట్టి అధికారంలో ఉన్నామన్న మదంతో పోలీసులను అడ్డుపెట్టుకొని ఆ కార్యక్రమాలను విచ్ఛిన్నం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారన్నారు. ×అదరం బెదరం – ప్రజల పక్షాన నిలిచే జగనన్న వెంటే తామందరం× అంటూ భారీగా తరలివస్తున్న ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నియోజకవర్గ కూడలి ప్రాంతమైన పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టు వద్దకు 5 మండలాల వైఎస్సార్ సీపీ శ్రేణులు చేరుకున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మార్కాపురం మెడికల్ కాలేజ్ వద్దకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమాల్లో ఎంపీపీలు దొంతా కిరణ్‌గౌడ్, ఆళ్ల సుబ్బమ్మ ఆంజనేయరెడ్డి, బెజవాడ పెద్ద గురవయ్య, జెడ్పీటీసీలు చేదూరి విజయభాస్కర్, యేర్వ చలమారెడ్డి, ఆర్.వాగ్యా నాయక్, ఆయా మండలాల సమన్వయ కర్తలు ఏకుల ముసలారెడ్డి, గంటా వెంకట రమణారెడ్డి, పోలిరెడ్డి కృష్ణారెడ్డి, దోమకాళ్ల వెంకటేశ్వర్లు, సింగారెడ్డి పోలిరెడ్డి, ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు షేక్.మజీద్, షేక్.నూర్‌అహమ్మద్, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు దొండేటి నాగేశ్వరరెడ్డి, ఇంటిలెక్చువల్ జిల్లా అధ్యక్షుడు అంగిరేకుల ఆదినారాయణ, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి ఉడుముల అరుణమ్మ, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎల్.రాములు, జిల్లా కార్యదర్శి ఆర్.అరుణమ్మ, ఆదిత్య విద్యా సంస్థల అధినేత సూరె రమేష్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, మండల పరిషత్ వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానానికి స్థలం చూపించాలని నిరసన

- పొన్నలూరు మండలం చెంచుపాలెం గ్రామంలో ఆందోళన
- తన పెద్దనాన్న మృతదేహంతో నిరసన తెలిపిన గ్రామస్తుడు నాగరాజు
- శ్మశాన స్థలం ఎక్కడో చూపించాలంటూ అధికారులకు వేడుకోలు
- చేసేదిలేక గ్రామ సమీపంలోని సొంత స్థలంలో మృతదేహానికి అంత్యక్రియలు


ఇదేనా శ్మశాన స్థలం అంటూ వాగును చూపిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న బాధితుడు


నివాస గృహాల సమీపంలోని సొంత స్థలంలో పోలయ్య అంత్యక్రియలకు తవ్విన గుంత

పొన్నలూరు: తమ గ్రామానికి అధికారులు, ప్రభుత్వం శ్మశాన స్థలం చూపించాలంటూ మృతదేహంతో నిరసన తెలిపారు. ఈ సంఘటన పొన్నలూరు మండలం మాలపాడు పంచాయతీ చెంచుపాలెం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుదే పోలయ్య (75) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. గ్రామంలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి ఆయన గుర్తుగా సమాధి నిర్మించుకోవాలని కుటుంబ సభ్యులు భావించారు. గ్రామంలో కొన్నేళ్లుగా అనువైన శ్మశాన స్థలం లేకపోవడంతో గ్రామస్తులు చేసేదిలేక గ్రామానికి సమీపంలో ఉన్న గొరెశల వాగులో కొంత మందికి దహన సంస్కారాలు, మరి కొంత మందిని ఖననం చేస్తూ వస్తున్నారు. ఇలా గ్రామానికి సరైన శ్మశానం స్థలం లేకపోవడంతో గ్రామంలో ఎవరైనా మరణించినప్పుడు వారి అంత్యక్రియలు చేయడానికి నానా అగచాట్లు పడుతున్నారు. అలాగే మరణించిన వారి గుర్తుగా సమాధి నిర్మించుకోవాలంటే గొరెశల వాగులో కాకుండా వారి సొంత స్థలాల్లో అంత్యక్రియలు చేస్తున్నారు. ఇటువంటి క్రమంలో గ్రామంలోని గుదే పోలయ్య అనారోగ్యంతో మరణించడంతో పాటు ఆయనికి సంతానం లేకపోవడంతో అతని బంధువైన గుదే నాగరాజు అంత్యక్రియలు బాధ్యత తీసుకుని సమాధి నిర్మించడానికి పూనుకున్నాడు. అయితే, తమ గ్రామానికి అనువైన శ్మశాన స్థలం లేదని, ఎవరైనా గ్రామస్తులు మరణిస్తే వాగులో దహన సంస్కారాలు చేయాల్సి వస్తోందని, అధికారులతో పాటు ప్రభుత్వం స్పందించి శ్మశాన స్థలం చూపించకపోతే తన పెద్దనాన్న అయిన పోలయ్యను గ్రామంలోని ఇళ్ల మధ్య ఖననం చేయడానికి అనుమతివ్వాలని జిల్లా నుంచి మండల స్థాయి అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేశాడు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

చివరికి సొంత స్థలంలోనే అంత్యక్రియలు...

ఇదిలా ఉంటే పోలయ్య ఖననం విషయంలో స్పందించిన అధికారులు గ్రామ సమీపంలో ఉన్న గొరెశల వాగు పక్కనే ఉన్న వాగుబోరంబోకు భూమిని గ్రామస్తులు శ్మశానంగా వినియోగించుకుంటున్నారని తెలిపారు. పోలయ్యను కూడా గ్రామంలోని ఇళ్ల మధ్య కాకుండా శ్మశాన స్థలంలో ఖననం చేయాలని సూచించారు. దీనికి నిరాకరించిన పోలయ్య కుటుంబ సభ్యులు వాగులో ఎలా ఖననం చేస్తారని, అలాగే సమాధి ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో పాటు గ్రామస్తుల నుంచి ఎలాంటి ఆటంకం ఏర్పడకపోవడంతో చివరికి నివాస గృహాల సమీపంలోని తమ సొంత స్థలంలోనే ఖననం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి గ్రామస్తులకు అనువైన శ్మశాన స్థలం కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భార్యపై అనుమానమే పెనుభూతమై..

- భార్యను హత్య చేసి కత్తితో గొంతు కోసుకున్న వ్యక్తి చికిత్స పొందుతూ మృతి
- వారం వ్యవధిలోనే భార్యాభర్తల మృతితో విషాదం


గొంతు కోసుకున్న మర్రిపూడి నారాయణ


భార్య జయమ్మతో నారాయణ (ఫైల్)

మర్రిపూడి భార్యపై అనుమానంతో రోకలి బండతో మోది చంపి ఆపై ఆత్మహత్యకు యత్నించిన మర్రిపూడి నారాయణ (53) గుంటూరు సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి కన్నుమూశాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని రేగలగడ్డ గ్రామానికి చెందిన మర్రిపూడి నరసింహ, చిన్నక్కల 4వ కుమారుడు చిన్ననర్సింహ అలియాస్ నారాయణకు మర్రిపూడి గ్రామానికి చెందిన ధర్మరాజు నరసింహ, నాగలక్ష్మిల రెండో కుమార్తె అయిన జయమ్మ (45)తో 28 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు కుమార్తెలు కాగా, వివాహం జరిగింది. భార్యాభర్తలిద్దరూ రేగలగడ్డ గ్రామ సెంటర్‌లో చిల్లర దుకాణం పెట్టుకుని జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో నారాయణ తన భార్యపై అనుమానం పెంచుకోవడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. చెప్పుడు మాటలు నమ్మిన నారాయణ భార్యను ఎలాగైన చంపాలని ఈ నెల 13వ తేదీ తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తున్న జయమ్మ (45)ను రోకలిబండతో తలపై బలంగా కొట్టాడు. దీంతో జయమ్మ అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. భార్య వియోగం తట్టుకోలేక అదే సమయంలో కత్తితో గొంతు కోసుకుని కన్నుమూయాలనుకున్నాడు. బంధువులు గమనించి నారాయణను గుంటూరు సర్వజన వైద్యశాలకు తరలించడంతో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. పెద్దకుమార్తె వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. అనుమానమే పెనుభూతమై వారం వ్యవధిలోనే భార్యాభర్తలు మృతిచెందడంతో వారి కుమార్తెలు, బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు.

వీఆర్‌ఓ ఇంట్లో చోరీ

- 11 తులాల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు అపహరణ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ

గిద్దలూరు రూరల్: మండలంలోని కొండపేట గ్రామంలో వీఆర్‌ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చొరబడి చోరీకి పాల్పడిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గిద్దలూరు మండలంలో వీఆర్‌ఓగా పనిచేస్తున్న లక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి మూడు రోజుల క్రితం చెన్నై వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని గ్రహించిన గుర్తుతెలియని దుండగులు తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువా పగలగొట్టి 11 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.2 లక్షల నగదు అపహరించారు. చెన్నై నుంచి తిరిగి వచ్చిన లక్ష్మి ఇంట్లో పరిస్థితి చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని సీఐ కె.సురేష్ పరిశీలించారు. క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యారంగ సమస్యలతో టీచర్లకు ఇబ్బందులు

- యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు


మాట్లాడుతున్న రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు

ఒంగోలు సిటీ: ఉపాధ్యాయులు విద్యారంగ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు అన్నారు. యూటీఎఫ్ రణభేరి బైక్ జాత పేర్నమిట్ట మీదుగా అద్దంకి బస్టాండ్, కలెక్టర్ కార్యాలయం, యూటీఎఫ్ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని ప్రభుత్వ పాఠశాలకు వచ్చే పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ వర్క్ ఎక్కువ ఉంటుందని, అందులో భాగంగా గంట గంటకు రాష్ట్ర, జిల్లా విద్యాశాఖ అధికారులు మెసేజ్‌లు పెట్టి సత్వరమే పూర్తి చేసి పంపాలని ఉపాధ్యాయులను మానసికంగా ఒత్తిడి తీసుకొస్తోందన్నారు. ప్రభుత్వం బోధనేతర పనులు తగ్గించి ఉపాధ్యాయులకు చదువు చెప్పేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డీ వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు సుమారు రూ.30 వేల కోట్లు బకాయిలు ఉన్నాయని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక బకాయిల మీద రూట్ మ్యాప్ ప్రకటించాలని కోరారు. 12వ పీఆర్సీ కమిషన్ వేయాలని ఐఆర్ 30 శాతం ప్రకటించాలన్నారు. 2003 డీఎస్సీ వారికి మెమో నంబర్ 57 ద్వారా పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై మాట్లాడుతూ సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈనెల 25వ తేదీ గుంటూరులో జరిగే రణభేరి ధర్నాలో ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ రవి ఉమామహేశ్వరి, ఎస్ చిన్నస్వామి, ఎం సంధ్యారాణి, నల్లూరి వెంకటేశ్వర్లు, ప్రభాకరరెడ్డి, నారాయణ, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు బైకులపై ర్యాలీ నిర్వహించారు.

జగనన్న లేఔట్‌పై కన్ను కుట్టి..!


విద్యుత్ స్తంభాల నుంచి పరికరాలు తొలగిస్తున్న కార్మికులు



తొలగించిన క్రాస్ ఆర్మ్స్, కండెన్సర్లు

పామూరు: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న లేఔట్లు ఏర్పాటు చేసి నివేశన స్థలాలు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. పామూరు మండలంలో 25 గ్రామ పంచాయతీల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 20కి పైగా ప్రాంతాల్లో లేఔట్లు వేశారు. వీటిలో సుమారు వెయ్యి మందికి పేదలకు స్థలాలు కేటాయించి పట్టాలు పంపిణీ చేశారు. కొన్ని ప్రాంతాల్లో పేదలు ఇళ్లు కట్టుకోగా మరికొన్ని ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకున్నారు. కాగా నాడు ప్రభుత్వం వేసిన లేఔట్లలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కూడా కల్పించారు. గుమ్మనంపాడు లేఔట్‌లో సుమారు 350కి పైగా విద్యుత్ స్తంభాలు వేసి వైర్లు లాగారు. ఏడాదిన్నర నుంచి పేదల గూడు ఘోషను పట్టించుకోని పాలకులు గుమ్మనంపాడు లేఔట్‌లో విద్యుత్ స్తంభాల వైర్లు, ఇన్సులేటర్లు, క్రాస్‌ఆర్మ్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లు తొలగిస్తున్నారు. పేదల కోసం వేసిన లేఔట్లలో విద్యుత్ స్తంభాల వైర్లు, ఇతర పరికరాలు తొలగించడం ఏమిటని, ఇది దుర్మార్గపు చర్యఅని స్థానికులు మండిపడుతున్నారు. దీనిపై విద్యుత్ ఏఈ జిలానీబాషాను వివరణ కోరగా.. ప్రభుత్వ ఆదేశాలతోనే జగనన్న కాలనీల్లో విద్యుత్ స్తంభాల వైర్లు, క్రాస్ ఆర్మ్‌లు, ఇన్సులేటర్లు తొలగిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతానికి గుమ్మనంపాడు లేఔట్‌లో మాత్రమే తొలగిస్తున్నామని చెప్పారు.

మహిళపై చిత్రవధ కేసులో నిందితులు అరెస్టు

పొదిలి: భార్యను అతి కిరాతకంగా హింసించిన కేసులో భర్తతోపాటు మరో ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పొదిలి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం తర్లుపాడు ఎస్సై బ్రహ్మనాయుడుతో కలిసి సంఘటన పూర్వాపరాలను విలేకరులకు వివరించారు. తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు ఎస్సీ కాలనీకి చెందిన భాగ్యలక్ష్మికి బాలాజీతో 12 ఏళ్ల క్రితం వివాహం కాగా నలుగురు సంతానం ఉన్నారు. మద్యానికి బానిసైన భర్త మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు. పలుమార్లు భార్యను హింసించి అవసరాల కోసం డబ్బు తీసుకెళ్లేవాడు. ఈ క్రమంలోనే భార్య చేతులను తాళ్లతో కట్టేసి లెదర్ బెల్ట్‌తో ఇష్టానుసారం కొట్టాడు. కాళ్లతో తన్నుతూ శారీరకంగా హింసకు గురిచేశాడు. సంఘటనకు కారకులైన నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి కత్తి, లెదర్ బెల్ట్, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించడంతో ఒంగోలు జిల్లా జైలుకు తరలించినట్లు సీఐ చెప్పారు.

పిడుగు పడి రైతు మృతి


లక్ష్మీనర్సారెడ్డి (ఫైల్)

మర్రిపూడి: పిడుగు పడి రైతు మృతిచెందిన సంఘటన మర్రిపూడి మండలంలోని శివరాయునిపేట గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. మృతుని బంధువులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన వేమిరెడ్డి లక్ష్మీనర్సారెడ్డి (60) గేదెలు మేపుకునేందుకు వల్లాపాలెం రహదారివైపున్న పొలంలోకి వెళ్లాడు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసి లక్ష్మీనర్సారెడ్డిపై ఒక్కసారిగా పిడుగు పడింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. తోటి పశుపోషకులు గమనించి బంధువులకు సమాచారం అందించారు. బంధువులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని విలపించారు. మృతునికి నలుగురు పిల్లలున్నారు. లక్ష్మీనర్సారెడ్డి వైఎస్సార్ సీపీలో కీలక నాయకునిగా పనిచేసి మంచి గుర్తింపు పొందాడు.